విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 20, సెప్టెంబర్ 2025

రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం టౌన్: రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పనులు పూర్తి అయ్యాక బిల్లులు నెలలోపు ఖచ్చితంగా ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎంఎస్ఐడిసి, సమగ్ర శిక్ష, హౌసింగ్, ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న వివిధ రకాల పనుల్లో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. పనులు పూర్తి అయ్యాక నెల దాటి ఒక్క బిల్ పెండింగ్ ఉండడానికి వీలు లేదన్నారు. ఏదైనా తేడా కనిపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్అండ్‌బి శాఖ పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారుల గురించి ఎస్ఈ వివరించారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఎన్ఆర్ఈజిఎస్ కింద సిసిరోడ్లు, బిటిరోడ్ల నిర్మాణాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపట్టడం జరుగుతోందని, ప్రత్యేక దృష్టి పెట్టి మంజూరైన పనులు పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. హౌసింగ్ శాఖ కింద అక్టోబర్ 2వతేదీ నాటికి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రతివారం లక్ష్యం నిర్దేశించుకుని పనులు చేపట్టాలని, ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. టిడ్కో పరిధిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడం, ఇళ్లలో మౌలిక వసతులు కల్పించడం చేపట్టాలని, ఇందుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. పెండింగ్ ఉన్న భూసేకరణ పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. తదిర అంశాలపై కలెక్టరు అధికారులతో చర్చించారు. ఏ విషయాన్ని తేలికగా తీసుకోకూడదన్నారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, పీఆర్ ఎస్ఈ సుబ్బారాయుడు, హౌసింగ్ పిడి శైలజ, ఎన్.హెచ్ పిడి తరుణ్, పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, ఎపిఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాసులు, ఆర్.అండ్.బి ఈఈ రాజగోపాల్, డిఈ కాటమయ్య, టిడ్కో ఈఈ సుధారాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాప్రభో.. మురుగు తొలగించండి

విశాలాంధ్ర-రాప్తాడు: అసలే వర్షాలు వచ్చే కాలం.. దాంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది మురుగు తొలగించండి మహాప్రభో అంటూ కాలనీవాసులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న బీసీ కాలనీలోని కాలువలను నెల రోజుల నుంచి శుభ్రం చేయకపోవడంతో చెత్తతో నిండి మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది రాత్రి వేళల్లో చిన్నారులు, పెద్దలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగును తొలగించి కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ఘనంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంతకల్లు: సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేవరగుడి జగదీష్ జన్మదిన వేడుకలు వృద్ధాశ్రమంలో ఘనంగా జరిగాయి. సీపీఐ పట్టణ కమిటి జన్మదిన శుభాకాంక్షలు తెలుపారు. ఈ సందర్భంగా అనాధ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, పంచిపెట్టారు. అనంతరం సీపీఐ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల పాలిట పెన్నిధి అనంతపురం జిల్లా సెక్రటరీగా సుదీర్ఘకాలం 14సంవత్సరాలు పాటు ఆలు పెరగని ఉద్యమాలు చేస్తూ, పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలుపై గొంతెత్తి ఉద్యమిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ అలుపెరగని పోరాటాలు చేస్తున్నటువంటి పోరాటయోధుడు డి.జగదీష్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పిసి కుల్లాయప్ప, ప్రజానాట్య మండలి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం నియోజకవర్గ నాయకులు,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు రోహిత్, పట్టణ కార్యదర్శి ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు ..

విశాలాంధ్ర - ఉరవకొండ : ఈనెల 21, 22 తేదీలలో ఉరవకొండ పట్టణంలో రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల సెపక్ తక్రా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సెపక్ తక్రా సంఘం అసోసియేషన్ చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, ప్రెసిడెంట్ షాహిన్ తెలిపారు. శుక్రవారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రంలోని 26జిల్లాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక్కడ పోటీల అనంతరం రాష్ట్ర జట్టు ఎంపిక చేసి ఎంపికైన జట్టు ఉత్తరాఖండ్లో వచ్చేనెల నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బాలబాలికల సెపక్ తక్రా పోటీలలో ఆంధ్ర రాష్ట్ర జట్టు పాల్గొంటుందిని వారు తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతిని సంఘం చైర్మన్ సప్తగిరి మల్లీ, ప్రెసిడెంట్ ఎంఎస్ షాహిన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీలు ముందుగా నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నారు రాత్రిపూట కూడా ఫ్లడ్లైట్ల వెలుతురులో ఈ పోటీలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజర్స్ మారుతి ప్రసాద్, పుల్లా రాఘవేంద్ర తెలిపారు.

మెడికల్ కళాశాలలు రక్షించాలి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలం మండలంలోని వసగుడ్డ గ్రామం వైసిపి మండల యూత్ అధ్యక్షులు హనుమంత రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండ తాలూకా సేవ్ మెడికల్ కాలేజ్ ధర్నాలో కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే ఉష నిర్వహించిన ధర్నాలో పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో టికరాజు శాంతప్ప సంతోషం, అభిమానులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అమలు చేస్తున్న 'స్వస్ నారీ స్వశక్త్ పరివార్ అభి యాన్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దర్గా హొన్నూర్ వైద్యాధికారి ని రఫియా సుల్తానాసూచించారు. మండలంలోని గోవిందవాడ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం మహిళలకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సర్పంచ్ నాగవేణి వన్నూరు స్వామి, టిడిపి సీనియర్ నాయకుడు వన్నూరు స్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: తన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏల రాష్ట్ర సంఘం పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా 20వ తేదీ ఆర్డీవో కార్యాలయం ముందు, 22వ తేదీ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అర్హులైన గ్రామ సేవకులకు పదోన్నతి కల్పిస్తూ, అందరికీ స్కేల్ అమలు చేయాలని లేనిపక్షంలో కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలు చేస్తున్న ధర్నాకు తహసిల్దార్ ఎస్.రమాదేవి,వీఆర్వోలు కృష్ణ, సుధాకర్, మల్లికార్జునను సంఘీభావం తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో వీఆర్ఏలు ఓబులేసు, తిమ్మప్ప, హరి,అరుణ్, రాజు,వీరప్పయ్య, రామాంజనేయులు, నారాయణస్వామి, సుధాకర్, మల్లికార్జున, ఇతర గ్రామ సహాయకులు ఉన్నారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని లక్ష్యం పల్లె గ్రామంలో పోషణ మాస ఉత్సవాల సందర్భంగా తాడిపత్రి సిడిపిఓ సాజిదా బేగం మెడికల్ ఆఫీసర్ అప్పయ్య ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సింగిల్ విండో అధ్యక్షులు చలమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ సాజిదా బేగం మాట్లాడుతూ గర్భిణీలు పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులు రామిరెడ్డి ఐసిడిఎస్ సూపర్ వైజాగ్ శంషాద్ బేగం, హెల్త్ సూపర్వైజర్ షబ్బీర్,బాల వెంకటేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడే పరిష్కారం

విశాలాంధ్ర-పామిడి: పామిడి తహసీల్దారు కార్యాలయంలో రైతుల రెవిన్యూ సమస్యలైన వన్ బి రికార్డులు, అడంగల్ కాపీలు, స్కెచ్ కాపీలు, పాసుపుస్తకాలు రీప్లేస్ మెంటు, పాతకేసులు, అన్నదమ్ముల బాగా పరిష్కారాలు, క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, చేర్పులు మార్పులు, డీలర్ల సమస్యలు ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడే చకచగా పరిష్కారం అవుతున్నాయని, ఏ నలుగురు కలిసినా అందరి నోటా ఇదే మాటలు బాగా వినిపిస్తోంది. తహసిల్దార్ కార్యాలయంలో మండలం లోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై ఆరోజు వచ్చిన అర్జీలను ఆరోజే పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరిస్తూ తహసిల్దార్ షర్మిల మండల ప్రజల మన్ననలు పొందుతున్నారు. అలాంటి అధికారికి పైన అక్రమదారులు, కొందరు రాజకీయ నాయకులు వారి అవినీతి పనులు చేయలేదని రాజకీయ ఒత్తిళ్లు చేస్తున్నా వారికే ఆమె అదరక బ్రదరక తనదైన మార్గంలో నడుచుకుంటూ తన కార్యాలయం లోని సిబ్బందిని అవినీతి అక్రమ దారుల ముడుపులను తీసుకోకూడదని హెచ్చరిస్తూ ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ ఎప్పటికప్పుడే పరిష్కరిస్తున్నదని మండల ప్రజల నుంచి మన్ననలు పొందుతూ ఆదర్శంగా నిలిచార నడంలో ఎలాంటి సందేహం లేదని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ప్రిన్సిపాల్‌పై దాడి చేసిన విద్యార్థి

విశాలాంధ్ర-శెట్టూరు: ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై దాడి సంఘటన వెలుగు చూసింది శుక్రవారం ఉదయం పాఠశాలను ప్రార్థన సమయంలో పదవ తరగతి విద్యార్థి చరణ్ పాటలు పాడుతుండగా అది గమనించిన ప్రిన్సిపల్ శ్రీరాములు ప్రార్థన సమయంలో ఎందుకు పాట పాడుతావ్ అడిగినందుకు విద్యార్థి చరణ్ ప్రిన్సిపల్ శ్రీరాములుపై దాడి చేశాడు. ప్రిన్సిపల్ విద్యార్థిని మందలించడంతో కోపోద్రిక్తుడై చేయి చేసుకున్నాడు. ఉపాధ్యాయులు విద్యార్థిని పాఠశాల నుంచి బయటకు పంపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు డిఎస్పి రవిబాబు శుక్రవారం జరిగిన ఘటనపై పాఠశాలలో విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్ శ్రీరాములు ఉపాధ్యాయులు వివరాలు మేరకు విద్యార్థి గతంలో కూడా సరైన క్రమశిక్షణ లేకపోవడంతో అనేకసార్లు మందులించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి టీసీ ఇచ్చి పంపమని ఆదేశాలు ఇవ్వడంతో విద్యార్థి తల్లిదండ్రులు టీసీ తీసుకోవడానికి ముందుకు రాకపోవడంతో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం కలిసి విద్యార్థి పైన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపాడు.

గోడౌన్ తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-యల్లనూరు: యూరియా గోడౌన్‌ను మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా, డిఏపి తదితర ఎరువులను పంపిణీ చేస్తున్నారు. రైతులకు యూరియా పంపిణీలో భాగంగా మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి గోడౌన్ తనిఖీ చేసి ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం యూరియా పంపిణీ చేస్తుందని ఏ రైతు అధైర్యపడవద్దని రైతులకు భరోసా కల్పించారు. యూరియా పంపిణీలో ఏవైనా అవకతవకలు జరిగాయంటే గోడౌన్ అధికారులకు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. అనంతరం గోడౌన్లో ఉన్న యూరియా, డిఏపి స్టాకు పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నార్పలో పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర - నార్పల : మండల కేంద్రంలోని సచివాలయం 2లో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ డివి.నారాయణమ్మ మాట్లాడుతూ రోజువారి ఆహారంలో కూరగాయలు పండ్లు ఆకుకూరలు, చిరుధాన్యాలు చేర్చుకోవాలని తెలిపారు. మంచి ఆహార అలవాట్లు,సురక్షితమైన నీరు పరిసరాలు, పరిశుభ్రంగా పెట్టుకోవాలని అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు ,ఏఎన్ఎంలు,హెల్త్ సూపర్వైజర్లు,అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా, విత్తనాలు అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

విశాలాంధ్ర - అనంతపురం రూరల్ : జిల్లాలోని రైతులకు అవసరమైన యూరియా, విత్తనాలు అందించాలని కోరుతూ... శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆనంద్ బాబుకి సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతులకు యూరియా 26,839 మెట్రిక్ టన్నుల అవసరం ఉందన్నారు. ఇంతవరకు 15241 మెట్రిక్ టన్నులు పంఫిణీ జరిగింది కాని ఇంకా జిల్లా వ్యాప్తంగా 6,827మెట్రిక్ టన్నులు అవసరం ఉందని, జిల్లా వ్యవసాయశాఖా అధికారులు చెబుతున్నరన్నారు. ఈ క్రాప్ అధారంగా ఎరువులు పంఫీణీ చేస్తామని మెలికపెట్టారు. కాని ఇంతవరకు 20 శాతం కూడ పంటనమోదు ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా ఎరువులు పంఫీణీ చేయాలన్నారు. యూరియా కొరతతో బ్లాక్ మార్కెట్లో కొనలేని పరిస్థితి రైతులకు దాపురించిందాన్నారు. పంట ఎదుగుదలకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈరోజు రైతులు పూర్తిగా ఇబ్బందులు పడుతున్నారు. మరొపక్క చాలా మంది రైతులు పంటలు వేయలేక ప్రత్యామ్నాయ విత్తనాలు వేయాలని, వేచిచూస్తుంటే పెసర, అలసంద, ఉలవ, సద్ద, జోన్న కోర్ర,రాగి, ప్రత్యామ్నాయ విత్తనాలు ఇంతవరకు రైతు సేవాకేంద్రాలలో అందుబాటులో ఉంచలేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా అందించాలన్నారు.

శానిటేషన్ కార్మికులకు న్యాయం చేయండి

ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, సూపర్ స్పెషలిటీ నందు నిత్యం విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ కార్మికులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. శానిటేషన్ కార్మికుల కాంట్రాక్టర్గా 1స్పెసలిటీ సర్వీసెస్ 2021 సంవత్సరంలో భాద్యతలు తీసుకున్నరన్నారు. ఈ సర్వీసెస్ కింద దాదాపు 200మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నరన్నారు. నెలసరి జీతం రూ.16వేలుకు ఒక్కొక్క కార్మికుడు ఈపీఫ్ కింద రూ.4వేలు చెల్లించాలన్నారు. అయితే ప్రతి కార్మికుడు నమ్మామాత్రంగా చెల్లుస్తూ.. వచ్చారు అలా చెల్లించినప్పటికి ఈపీఫ్లో కొన్ని కోట్ల రూపాయలు అవినీతి జరిగింది. వాటిని విచారించాలని పలుసార్లు వినతుల రూపంలోపై స్థాయి అధికారులకి విన్నవించినప్పటికి విచారణ ఉట్టి కేక్కించారని తెలిపారు. ఇప్పటికైనా ఈపీఫ్ సొమ్ములో జరిగిన అవినీతిపై సమగ్రవిచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి నెల వేతనం అందేలా చూడాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, రాజారెడ్డి, సింగనమల నియోజకవర్గ కార్యదర్శి కత్తి నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజేష్ గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: విద్యుత్ ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ ఒప్పంద ఉద్యోగ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్యాలయం ఎదుట విద్యుత్ ఒప్పంద ఉద్యోగుల ఆధ్వర్యంలో ఐదవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డి.ఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. జేఎంఎల్ గ్రేట్‌టులను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో, క్షేత్రస్థాయిలో ఉన్న అన్ని ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలో విద్యుత్ ఉద్యోగులు శ్రీనివాసులు, హర్ష స్వామి, యు.రమేష్, రామాంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టుబడిన వహనాలు బహిరంగ వేలం

విశాలాంధ్ర-కణేకల్లు: కణేకల్ ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం రోజున ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనంతపురం వారి ఆధ్వర్యంలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలంపాట వేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్.ఉమా బాయి మాట్లాడుతూ గతంలో వివిధ మద్యం కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించామని.వేలం ప్రక్రియలో మొత్తం రూ.1,14,500 లభించగా, ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు చలానా రూపంలో జమ చేయడం జరిగిందని. అలాగే వివిధ మద్యం కేసులలో పట్టుబడిన డ్యూటీ పేడ్ లిక్కర్, నాన్ డ్యూటీ పేడ్ లిక్కర్ మరియు ఐడి లిక్కర్ కలిపి మొత్తం 63.65 లీటర్లు (దాదాపు రూ.30,000 విలువైన) మద్యాన్ని ధ్వంసం చేయబడినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. ఉమా బాయి మాట్లాడుతూ మద్యం కేసులపై కఠిన చర్యలు కొనసాగుతాయని, పట్టుబడిన వాహనాలు, మద్యం సరుకు చట్టపరమైన విధానాల ప్రకారం వేలం వేయడం లేదా ధ్వంసం చేయడం జరుగుతుందని తెలిపారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-బెలుగుప్ప: మండలం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని కాలువపల్లి పాఠశాలలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అధ్యక్షులుగా జి.రాము ప్రధాన కార్యదర్శిగా ఏ.మోహన్ రాజు జిల్లా కౌన్సిలర్‌గా సీ.తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి, కె.గాయత్రిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశులు అబ్జర్వర్సుగా జిల్లా కార్యదర్శి రాష్ట్ర కౌన్సిలర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులుగా కె.నాగేంద్ర, వెంకటరాముడు, జి.రాము, ఏ.పార్వతి, తులసి నాయక్, చంద్రశేఖర్ నాయుడు, సంగప్ప, ఓబులేసును ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ నాలుగు విడుదల కరువు భత్యాన్ని, పీఆర్సి కమిషన్ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఎప్పుడు ఉపాధ్యాయ సమస్యలపై పోరాటానికి ముందుంటుందని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేటీకరణకు ఒప్పుకోం..

విశాలాంధ్ర-గుత్తి: ఆర్టీసీ డిపో, బస్టాండ్ ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలు చేస్తాం అని శుక్రవారం గుత్తి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ దాతల సహకారంతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేటు పరం చేస్తామని పేర్కొనడం పై వైఎస్ఆర్సిపి ఐటివింగ్ అధ్యక్షుడు వై రాజశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల రావు పర్యటనలో ప్రజలు బస్టాండ్ అభివృద్ధి చేసి పడిపోయిన బస్టాండ్ ను కట్టమని అడిగితే ఆయన స్పందిస్తూ పిపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తామని పేర్కొనడం హాస్యాస్పదన్నారు. ప్రజల సొమ్మును ప్రైవేటు పరం చేయడం కూటమి విధానం అన్నారు. ఇప్పటికే రూ.రెండులక్షల కోట్ల అప్పులు చేసి ఇలా ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెట్టడం దారుణం అన్నారు. గుత్తి డిపోలో యాభై బస్సులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వం మూడువేలా ఐదువందల డీజిల్ బస్సులు వెయ్యి ఎలెక్ట్రిక్ బస్సులను 2023లోనే కొనుగోలు చేసిందన్నారు ఆర్టీసీని వైఎస్సార్సీపీ ప్రభుత్వం లో విలీనం చేస్తే కూటమి అమ్మకానికి పెడుతుందని విమర్శించారు. ఇలానే ప్రైవేటు పరం చేస్తే నిరసన కార్యక్రమాలు చేపడతాం అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మున్సిపల్ కౌన్సిలర్ వరదరాజులు పట్టణ కార్యదర్శులు గోపిరెడ్డి సునీల్ కుమార్ బ్రహ్మ కుమార్, హరిబాబు పులప్ప అరుణ్ కుమార్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-శెట్టూరు : గ్రామీణ శక్తి మార్గం పోషకాలకు బలమైన పునాది అని సూపర్వైజర్ భారతి పేర్కొన్నారు శుక్రవారం మండల పరిధిలో బొచ్చుపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ పిల్లలకు మంచి ఆహారంతో పాటు చదువు కూడా చాలా అవసరమని తెలిపారు. సమాజంలో మహిళలు భద్రత, ఆరోగ్యకరమైన మహిళ కోసం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిని ఉపయోగించుకొని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జానకి, శారద,ఆదిలక్ష్మి,గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొనారు.

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

విశాలాంధ్ర - జేఎన్టియుఏ: దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య హెచ్. సుదర్శన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్టీయూఏలో 2025 పశ్చిమ మండల ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపిక కార్యక్రమాన్ని వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు. జేఎన్టీయూఏ అనుబంధ కళాశాలల నుండి 60 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ తో దేశ సేవలో పాల్గొనేందుకు అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల వికాసం వైపు అడుగులు వేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై దాడి

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణంలోని మంజూరు టాకీస్ కాలనీలో గల రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆదినారాయణ, ఆయన కుమారుడు హరికృష్ణ ఇద్దరూ వారి ఇంటికి వద్ద గల డ్రైనేజీని పారిశుద్ధ కార్మికులు శుభ్రపరుస్తూ ఉండగా కులం పేరుతో అన్ పార్లమెంట్ భాషతో నానా దుర్భాషలాడుతూ మావృత్తికి ఆటంకం కల్పిస్తూ కొట్టాడని స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఎంతో అంకితభావంతో పంచాయతీ కార్మికులు డ్రైనేజీలను శుభ్రపరుస్తూ ఉండగా వారిపై దుర్భాషలు ఆరోగ్యంగాక దాడి చేయడం సోషనీయమని దళిత ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కార్మికులకు మద్దతుగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు సాకే ఓబులేష్, మండ్లరాజు, సుధీర్ మధు విజయ్ తదితర నాయకులు మాట్లాడుతూ స్థానిక పోలీసులు ఆదినారాయణ ఆయన కుమారుడు హరికృష్ణలపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు,తోపాటు దాడి కేసు, కాల్ మనీ కేసులు నమోదు చేయాలని లేని యెడల జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు ర్యాలీలు నిరాహార దీక్షలు రాస్తారోకోలు లాంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపకపోతే నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు.

సెపక్ తక్రా క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక కరిబసవ స్వామి రిక్రియేషన్ క్లబ్ వారు ఆర్థిక సహాయంతో జిల్లా జట్టుకు క్రీడా దుస్తులు, గెలుపొందిన క్రీడాకారులకు అందించే మెమొటోలు కప్పులు, షీల్డ్ ను ఉచితంగా అందించారు. శుక్రవారం స్థానిక ఎస్ కే ఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనంతపురం జిల్లా సెపక్తక్రా క్రీడా సంఘానికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ కే ఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం ఎర్రి స్వామి నాయుడు, కార్యదర్శి సి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఉరవకొండలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతపురం జిల్లా జట్టు మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెపక్తక్రా సంఘం ప్రెసిడెంట్ ఎం ఎస్ షాహిన్ లయన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎస్కె ఆర్ క్లబ్ ఈసీ మెంబర్లు శ్యామ్ రావు, డీకే ప్రసాద్,ఇతర ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విద్యారంగ సమస్యలు అసెంబ్లీలో చర్చించాలి

- జీవో నెంబర్ 107,108ని రద్దు చేయాలి
- రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి
- మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాల్సిందే..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కొరకు ఎన్నికలలో విద్యార్థులకు విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలలో భాగంగా కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్డిఓ వసంత్ బాబుకి నిబంధనలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తాం విద్యార్థులకు ఏ కష్టాలు కూడా ఉండవు వారికి అండగా నేనుంటానని హామీ ఇచ్చిన నారా లోకేష్ అవి అమలుపరచకుండా సూపర్ హిట్ సుపరిపాలన అంటూ సంబరాలు చేసుకుంటున్నారు. కానీ విద్యార్థుల కష్టాలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 6400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయక గత అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన 600 కోట్లు కేవలం పేపర్ ప్రకటనకే పరిమితమైంది తప్ప, ఏ ఒక విద్యార్థి ఖాతాలో జమ కాలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి పవన్, గర్ల్స్ కన్వీనర్ మౌలిక, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ రజిని ,సహాయ కార్యదర్శి బాలు, గోపి, నాయకులు గురు ప్రసాద్, విటల్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్య దర్శి వెంకట్ నాయక్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్ మాట్లాడారు...ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్ పట్టణ నాయకులుశంకరప్పా,ప్రవీణ్ నాయక్, వీరేష్,భాస్కర్ ,మోహన్,తేజ, అఖిల్, ప్రవీణ్,అరుణ్, దేవేంద్ర ,రాజు ,సంతోష్ ,వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గుపర్తి చందు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి రాజు ఉపాధ్యక్షులు రాజేష్, కరుణాకర్ నాయకులు లాలు స్వామి, ఖాసీం,సిద్ధిక్, మన్సూర్ వలి, డిగ్రీ విద్యార్థులు, పాల్గొన్నారు.

కొత్త ఈ-పాస్ యంత్రాల పంపిణీ

విశాలాంధ్ర-పుట్టపర్తి : రాష్ట్ర ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ జిల్లాకు 1367 కొత్త ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కొత్త ఈపాస్ యంత్రాలను పంపిణీ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్ వారీగా షెడ్యూల్ ప్రకటించి, పాత యంత్రాలను తిరిగి స్వీకరించి వాటికి కొత్త ఈ-పాస్ యంత్రాలను అనుసంధానం చేశామన్నారు. ఇందుకు సంబంధించి గత రెండు రోజులుగా మండలాల వారీగా ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కొత్త యంత్రాల్లోని సౌకర్యాలను అధికారులచే డీలర్లకు వివరించారు. కొత్త ఈ-పాస్ యంత్రాల ద్వారా కార్డు దారుడి కళ్ళు స్కాన్ చేసి, స్మార్ట్ కార్డు స్వైప్ చేసి, లేదా వేలిముద్రల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయవచ్చు. ఈ ఆధునిక సదుపాయాల వల్ల ఫెయిల్యూర్ కేసులు గణనీయంగా తగ్గడం తోపాటు రేషన్ సరుకులు వేగంగా, సులభంగా అందజేయగలుగుతున్నారని తెలిపారు. ఇకపై సెప్టెంబర్ 26వ తేదీ నుండి 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు,వికలాంగులకు రేషన్ సరుకులు అందజేయడముతో జిల్లా వ్యాప్తంగా 1367 చౌక ధరల దుకాణాలలో ఈ-పాస్ యంత్రాల వినియోగం అధికారికంగా ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, అధికారులు డీలర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి సర్పంచ్ లేఖ...

విశాలాంధ్ర-అమడుగూరు: మండల పరిధిలోని చీకరేవులపల్లి సర్పంచ్ సురేంద్ర రెడ్డి ఆర్డిటి సమస్యకు ఎఫ్‌సిఆర్ఏను రెన్యువల్ చేయాలని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత 50సంవత్సరాల నుండి ఆర్‌డిటి సంస్థ జిల్లాలోని అన్ని నిరుపేద వర్గాలకు కల్పవృక్షంగా ఉందని, విద్య, వైద్య, గృహ, మహిళ ఆర్థిక అభివృద్ధి, చెరువులు చెక్ డాములు, గ్రామాలకు త్రాగునీటి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి లక్షలాదిమంది నిరుపేదలను ఆదుకున్న ఆర్డిటి సంస్థను, సంస్థకు విదేశాల నుండి వచ్చే నిధుల యొక్క ఖాతాను, ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ అకౌంట్‌ను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడం వల్ల కరువు ప్రాంతమైన మా జిల్లా ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని, మా పంచాయతీ నుండి సమస్య యొక్క ఖాతాను వెంటనే రెన్యువల్ చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి అమిత్ షాకి తీర్మాన లేఖను పంపుతున్నామన్నారు.

గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలో గురువారం రాత్రి కర్నాటక సరిహద్దులో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నుండి మన ఆంధ్రలోకి ప్రవేశించే చిలమత్తూరు మండలం మీదుగా వెళ్లే చిత్రావతి, కుషావతీ నదులు అంతకంతకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. నదీపర్వాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,పాఠశాలలకు నదులు దాటుకొని వెళ్లె ప్రాంతాలలో విద్యార్థులకు తగిన సూచనలు చేయవల్సిన అవసరం ఉంది విద్యాశాఖ అధికారులు ఆ మేరకు పాఠశాలలకు సమాచారం తెలిపారు, ముఖ్యంగాకోడూరు,సుబ్బరావుపేట, శెట్టిపల్లి-చాగ లేరు, కొడికొండ- చిత్రావతి కుశావతి నదులు ప్రవహించే ప్రాంతాలలో పోలీసులను అప్రమత్తం చేశారు, విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు, ముఖ్యంగా పశువుల కాపరులు, బోరు బావల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మున్నీర్ అహ్మద్ పేర్కొన్నారు.

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- మెగా సోలార్ ప్రాజెక్టు నెలకొల్పండి
- పరిశ్రమల ఏర్పాటుకు భూములు అందుబాటులో..
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే..

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని తగినన్ని భూములు ఉన్నాయని నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లా కర్ణాటక రాజధాని బెంగళూరుకు మరి ముఖ్యంగా అంత ర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఉండడం వల్ల ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన ప్రాంత మని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శుక్రవారం శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమల ఏర్పాటు పై ప్రభుత్వాన్ని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గం లోని కప్పల బండ పంచాయతీలో ఏపీఐఐసీ ద్వారా 2017 లో ఎకరా 11.74 లక్షలతో 104.64 ఎకరాలను అప్పటి టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయక త్వంలో అప్పటి మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో పరిశ్రమలు ఏర్పాటుకు భూముల సేకరిం చారు. పుట్టపర్తి మండలం కప్పల బండ పంచాయతీలో సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు ఎంతమందికి అనుమతులు ఇచ్చారు ఇంకా ఎంత మిగులు భూమి ఉందో తెలపాలని ప్రభుత్వం ద్వారా సంబంధిత పరిశ్రమల శాఖ మంత్రి వెల్లడించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు ప్రత్యేకంగా మహిళలకు ప్రభుత్వం ద్వారా పరిశ్రమలకు రాయితీలు. విద్యుత్ రాయితీ వంటి సౌకర్యం కల్పించే అవకాశాలు ఉన్నాయా అని అడిగారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా 2008నుంచి 2009 మధ్యకాలంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు ప్రాంతంలో రూ.లక్ష కోట్లతో 65 వేల ఎకరాలలో సుమారు 60లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సైన్స్ సిటీ ఏర్పాటు చేస్తామని ఆనాటి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చి ఏపీఐఐసీ ద్వారా సుమారు 402 ఎకరాలు ప్రభుత్వం ద్వారా సేకరిం చడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐసీ ద్వారా సేకరించిన భూములతో పాటు ప్రైవేట్ పరంగా ఎంతో అనుకూలమైన భూములు చౌక ధరకు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడుని, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిని కోరారు. మెగా సోలార్ ప్రాజెక్టు ఏమైనా నెలకొల్పే అవకాశాలు ఉన్నాయా.. అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వం ద్వారా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిని ప్రత్యేకంగా కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల ఎప్పుడు..?

- రూ.6400 కోట్లు విడుదల చేయాలి
- పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర

విశాలాంధ్ర-కదిరి : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేమారెడ్డి సర్కిల్ నందు వినూత్న రూపంలో నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరం కొరకు ఎన్నికల్లో విద్యార్థులకు విద్యారంగానికి ఇచ్చిన హామీల అమల కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వేమారెడ్డి కూడలిలో చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పడిందని పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే పద్ధతులలో పీపీపీ విధానం తీసుకువచ్చి పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్షలాగా ప్రైవేట్ పరం చేస్తుందని మండిపడ్డారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నంచేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, శ్రీన, మహేష్, బాబు, బ్రహ్మయ్య, సురేంద్ర, రోహిత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

23న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - మడకశిర : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో, ఈనెల 13న ఉదయం 9గంటలకు మడకశిర పట్టణంలోని ఎస్వైటిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాదాపు 11 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని వాటి ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మెగా జాబ్ మేళాలో హెచ్ 1హెచ్ ఆర్ సొల్యూ షన్స్ , క్రెడిట్ యాక్సెస్, డ్రోగో డ్రోన్స్, పవరైన్స్,యాక్ట్, టాటా ఎలక్ట్రానిక్స్, డిఎస్సీ, కిమ్స్, లిమ్స్, డాక్టర్ రెడ్డి హ్యుందాయ్ మొబైస్, లాంటి 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా,బి. ఫార్మసీ ,ఎం. ఫార్మసీ, నర్సింగ్ ,ఎనీ డిగ్రీ , ఎనీ బి.టెక్, పి.జి, చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈమెగా జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ.10 వేల నుండి 25 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్,రెండు ఫోటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు , 99666 82246, ఫోన్ నంబర్స్ కు సంప్రదించాలని తెలియజేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సెట్‌లో రిజిస్టర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి గాత్ర విభాగంలో విద్యార్థినీలు ఎంపిక..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని జి వి ఈ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులైన ఆర్.హరిణి, టి. మనోజ్ఞ, ఎస్.మెహతాజ్‌లు ఈనెల 11వ తేదీ నుండి 12వ తేదీ వరకు బుక్కపట్నం ప్రభుత్వ డైట్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి గాత్ర విభాగంలో విద్యార్థినీలు ఎంపిక య్యారని హెడ్మాస్టర్ సుమన తెలిపారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్‌తో పాటు సంగీత ఉపాధ్యాయులు రమణవాణి ఇతర ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థినీలు, పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు వారు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

వీఆర్ఏల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: వీఆర్ఏల హామీలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని. వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ పెద్దన్న, తెలిపారు దీక్షలో భాగంగా రెండవ రోజు తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్న ఎలాంటి సమస్యలు పరిష్కారం చూపలేదు అన్నారు. శనివారం పుట్టపర్తి ఆర్డిఓ కార్యాలయం వద్ద డివిజన్లోనే వీఆర్ఏలు ధర్నాలో పాల్గొనాలన్నారు. 22వ తేదీ కలెక్ట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం తాహసిల్దార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు శివప్రసాద్, సాయి, పద్మావతి,గంగాధర్,బాబు,చిన్నయ్య,గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో చట్టపరంగా పనిచేయాలి

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని గ్రామాలలో శాంతిభద్రతల విషయంలో చట్టపరంగా తమ విధులను నిర్వర్తించాలని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్లో మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో గల శాంతి భద్రతల సమస్యలపై వారు చర్చించారు. అలాగే మహిళలపై జరిగే నేరాల విషయంలో ముందస్తుగా తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. గ్రామాలలో మహిళలను వేధించే ఆకతాయిల పైన ప్రత్యేక నిఘా ఉంచి వారి యొక్క సమాచారాన్ని ఎప్పటికప్పుడు మాకు తెలియజేయాలని తెలిపారు. అట్టివారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు.

వీఆర్ఏలు సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-రొళ్ల: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్షావలికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్ఏల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోలేదన్నారు. వీఆర్ఏలకు నెలకు రూ.20 వేల జీతం అందించడంతో పాటు మిగతా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వారికి కూడా అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలు హనుమంతరాయప్ప శివలింగప్ప, సందీప్, చిక్కన్న లక్ష్మినరసప్ప, నాగరాజు రంగనాథ్,కరియన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని ఆడదాకులపల్లి గ్రామానికి చెందిన రవీంద్రనాయక్, లతాబాయిల ఇద్దరు కుమారులు సరస్వతీ పుత్రులే.. రవీంద్ర నాయక్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు డేనియల్ నాయక్ ఇప్పటికే వైద్య విద్యను దాతల సహాయం పొంది విద్యనభ్యసిస్తున్నాడు. ఇప్పుడు రెండో కుమారుడు సంతోష్ నాయక్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కళాశాల ఫీజు చెల్లించినా వసతి ఖర్చులు చెల్లించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి రూ.30వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా పెనుకొండలోని క్యాంపు కార్యాలయం నందు వారి తల్లిదండ్రులకు ట్రస్ట్ డైరెక్టర్‌లు,నాయకులు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేసవయ్యా, సీనియర్ టీడీపీ నాయకులు నారాయణ స్వామి, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ కన్వీనర్ ప్రసాద్, కుపేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ నాగార్జున, డైరెక్టర్లు, నీరు గంటి చంద్రశేఖర్,రామాంజనేయులు, బాబుల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీఎంహెచ్‌వో



విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలంలో విష జ్వరంతో మృతి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి మహమ్మద్ షాహిద్ కుటుంబాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫై రోజా బేగం శుక్రవారం పరామర్శి ంచారు. విద్యార్థి మరణానికి దారి తీసిన పరిస్థితులను తల్లిదండ్రుల నుండి తెలుసుకున్నారు. ఆమె సూచనల మేరకు 177ఇండ్లలో ఇంటిం టా జ్వరపీడితుల సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో అబేట్ పిచికారీ చేయించగా, ఇళ్లలో ఫైరిథ్రమ్ స్ప్రేయింగ్ చేపట్టారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ ఓబులు, మండల వైద్యాధికారిని శ్వేత, సిహెచ్ఓ వన్నప్ప, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ దేవళం నాయక్, సూపర్వైజర్ శశిధర్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, సర్పంచ్ లక్ష్మీదేవి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ నూతన భవనం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండు రంగ మిరంతయ్య, అనంతపురం రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, గుడిబండ కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య అలాగే వారి సిబ్బంది చేతుల మీదుగా కెనరా బ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ ఖాతాదారులకు మహిళ సంఘ సభ్యులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కెనరా బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకొని బ్యాంకులో పొందిన రుణాలను సకలంలో చెల్లించి బ్యాంకును అభివృద్ధి పరుస్తూ ఖాతాదారులు అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ అలాగే బ్యాంక్ ఖాతాదారులు మహిళా సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రీషి విద్యాలయం సృజనాత్మక విద్యకు నిలయం

విశాలాంధ్ర-ధర్మవరం: రిషి విద్యాలయం సృజనాత్మక విద్యకు నిలయమని హెడ్మాస్టర్ కరణ్ స్వరూపాసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల చేత సొంతంగా ఆర్టికల్స్, సమీక్షలు రాయడం నేర్పడం జరుగుతోందని తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న సహర్ష్, నందన్, రిషిత, కమల్, నికిత సవిత్రులు ప్రాజెక్ట్ పద్ధతిలో ప్రత్యక్ష పాఠ్య బోధన చేసినందులకు వారికి డీన్.భాస్కర్ రెడ్డి సిఏఓ. రవీంద్ర ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. డీన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేలా వారిలోని ప్రతిభ పాటవను మెరుగుపరిచేలా ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఏవో.రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్.కళ్యాణి, సైన్స్ ఉపాధ్యాయులు ఉమాదేవి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పేన్ డౌన్ : జావీద్

విశాలాంధ్ర-ధర్మవరం: దస్తావేజు లేఖరుల సమస్యల పరిష్కారానికై ఐక్యమత్యంగా పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షులు జావిద్, ఉపాధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి మహేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వలన అనగా ఆధార్ ఓటిపి, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డ్ ప్రైమ్ సాఫ్ట్వేర్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజు తయారీ అనేది జటిలమౌతూ తీవ్ర జాప్యానికి గురి అవుతున్నదని తెలిపారు. ఈ రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులు రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఎలాంటి సేవలు అందించబడును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార దర్శి నాగార్జున, కోశాధికారి మల్లికార్జున, లేఖరులు గోపి, బాలాజీ, కీర్తి, వాజిద్, సదాశివ, సుధాకర్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-బుక్కపట్నం: వీఆర్ఏలకు పే స్కేల్ విధానాన్ని అమలు చేసి నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని వీఆర్ఏల మండల అధ్యక్షులు పెద్దన్న డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం వీఆర్ఏలు తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏల ప్రధాన సమస్య అయినా పేస్కల్ విధానాన్ని అమలు చేసి అర్హులకు ప్రమోషన్స్, కారుణ్య నియామకాలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు నరసింహులు, చలపతి, నాగరాజు, రాము, నాగభూషణ, సిపిఐ నాయకులు శిక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: మధ్యంతర భృతి 30 శాతంతో పిఆర్సి కమిటీ వెంటనే నియమించాలని ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షులు అమరా చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ లోని వివిధ పాఠశాలల యందు సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు జిల్లా గౌరవ సలహాదారుడు అన్నం అరవింద్ ,ఉపాధ్యాయులు హర్షవర్ధన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌పై ముందస్తు సమాచారం తెలపండి

విశాలాంధ్ర-ఓబులదేవరచెరువు: తమ సచివాలయాల పరిధిలో ఎలాంటి ఈవ్ టీజింగ్,క్రైమ్, మహిళలపై అసభ్య ప్రవర్తన,చైల్డ్ మ్యారేజ్ తదితర ఇల్లీగల్ యాక్టివిటీస్ పై ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని మహిళా పోలీసులకు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం మండలంలోని అన్ని సచివాలయాల మహిళా పోలీసులతో ఎస్సై మల్లికార్జున రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... పై అధికారుల ఆదేశాల మేరకు సచివాలయాల మహిళా పోలీసులతో ఈరోజు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు,మహిళలపై అసభ్యకర ప్రవర్తన లేదా ఎక్కడైనా ఇల్లీగల్ యాక్టివిటీస్ ఉంటే వెంటనే ఎస్ఐ లేదా పోలీసులకు సమాచారం ఇస్తే అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక చర్యలు,కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే సామాన్య ప్రజలు కూడా వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. మండలంలోని సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ ఆపాలి

విశాలాంధ్ర-పెనుకొండ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు నిరసనగా విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ గురించి మాట్లాడే అర్హత కూటమి ప్రభుత్వానికి ఉందా, ఫేక్ వీడియోలు ఫేక్ ఫోటోలతో ఇంకెన్ని రోజులు మీరు ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తారు అని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే మీరు రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్కటి మెడికల్ కాలేజీ అయినా తీసుకువచ్చారా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కోసం వైద్య విద్యను కలను సహకారం చేయడంతో పాటు పేదలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి రాష్ట్ర యువజన విభాగమ అధ్యక్షులు జక్కంపూడి రాజా ,నియోజకవర్గ ఇన్చార్జీలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ,విశ్వేశ్వర్ రెడ్డి ,మాజీ ఎంపీ తలారి రంగయ్య ,వీర లక్కప్ప,వైఎస్ఆర్సిపి శ్రేణులు పాల్గొన్నారు.

రైతుకు పాము కాటు ..

విశాలాంధ్ర - అగళి : అగలి మండలం ఇనుగులూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తికి శుక్రవారం తన పొలంలో పనిచేసుకుంటూన్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు గమనించి రోళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యచికిత్సల కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. వ్యవసాయ పనులు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెట్లు ఎపుగా పెరగడంతో విషపురుగులు ఉంటాయని వైద్యాధికారులు తెలియజేస్తున్నారు.

గోరంట్ల ఇంచార్జ్ ఎంపీడీవోగా నరేష్ కృష్ణ

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా సరేష్ కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరేంద్ర కుమార్‌కు డీడీఓగా పదోన్నతిపై డోన్‌కు బదిలీ కావడంతో పెనుకొండ ఎంపీడీవో నరేష్ క్రిష్ణకు గోరంట్ల ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర థర్డ్ పార్టీ వెరిఫికేషన్

విశాలాంధ్ర - హిందూపురం: హిందూపురం రూరల్ పరిధిలోని తూముకుంట పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గురించి థర్డ్ పార్టీ టీం కుమారి కావ్య, ఆశాలత పంచా యతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు, తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ, తడి పొడి చెత్త సేకరణ మరియు వర్మీ కంపోస్ట్ ఏర్పాటు చేయడం, ట్రై సైకిల్ ట్రాక్టర్, ద్వారా ఇంటి నుండి ప్రతి రోజు నూరు శాతం చెత్త సేకరణ, బిన్ బాగ్‌ను ఆ వీధులలో పాటించే విధంగా చూడాలని, వర్మీ కంపోస్ట్ అమ్మకాలు వాటి చలానా వివరాలు, సచివాలయంలో జరుగుతున్నటువంటి సేల్స్ రిజిస్టర్ తదితర అంశాలపై చర్చించారు. డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, సర్పంచ్ రత్నమ్మ చిన్నవీరప్ప,పంచాయతీ సెక్రెటరీ కెంచరాయప్ప, స్వచ్ఛభారత్ ఎంసిఓ.దాదాపీర్, ఎంపీటీసీ సభ్యులు షేక్ షమీమ్ ఉన్నీసాతో పాటు సచివాలయం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న పరగోడు డ్యాం...చిత్రావతికి జలకళ

విశాలాంధ్ర-గోరంట్ల: ఎడతెరిపి లేకుండా కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి, దీంతో ఎగువ ప్రాంతం నుండి చిత్రావతి నదికి నీరు చేరుతుండడంతో పాటు కర్ణాటక ప్రాంతంలోని పడగోడు డ్యాం నిండి పొంగి ప్రవహిస్తుండడంతో చిత్రావతి నదికి జలకళ సంతరించుకుంది,దీంతో రాత్రి నుండి చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ సందర్భంగా చిలమత్తూరు, గోరంట్ల, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తో పాటు రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు,గోరంట్ల చిత్రావతి నది పొంగి ప్రవహిస్తుండ డంతో కోనేరు పూర్తిగా నిండి,గంగమ్మ దేవాలయం సగం పైగా నిండి నది ప్రవహిస్తోంది, దీంతో చిత్రావతి నదిని తిలకించేందుకు ప్రజలు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు, అయితే చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న రైతులు నీటి ప్రవాహం తగ్గేంతవరకు వెళ్ళరాదని రైతులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరించారు.

వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారి సమస్యల పైన నిరాహార దీక్షలు చేపట్టారు. పట్టణంలో రెండవ రోజు వారి దీక్షకు మద్దతుగా ఏఐటియుసి కార్మిక సంఘం,సిపిఐ ఆధ్వర్యంలో వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం సిపిఐ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏలు తమ సమస్యల సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు చేపడుతున్న నిరాహార దీక్ష కార్యక్రమంలో వీఆర్ఏలు శుక్రవారం రెండవ రోజు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకల రాజా, మహిళా సమైక్య లీడర్స్ లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ,ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు, గోవిందరాజులు, అన్నం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు తాజుద్దీన్, సుబ్బు, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ అపహరణ

విశాలాంధ్ర-నల్లమాడ : మండల పరిధిలోని కురుమాల, మసక వంకపల్లి, గ్రామ పరిధిలోని రైతుల వ్యవసాయ బోరుబావుల వద్ద నిర్మించిన ట్రాన్స్ ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న కాపరు వైరును అపరహించారని బాధిత రైతులు రామ మోహన్, శ్రీనివాసులు, శుక్రవారం నల్లమాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తు న్నామని తమ వ్యవసాయ బోరుబావులు వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్ లను ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో దొంగలించడం జరుగుతోం దని పోలీసులకు తెలిపిన స్పందన కరువైందని బాధితులు విద్యుత్ శాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ట్రాన్స్ ఫార్మ ర్లను దొంగలిస్తున్న వారిని గుర్తించి వెంటనే వారిని అరెస్ట్ చేసి చర్యలుచేపట్టాలని బాధిత రైతులు కోరుకుంటున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 20, సెప్టెంబర్ 2025

అన్నదానం దైవ సేవతో సమానం

విశాలాంధ్ర-ధర్మవరం: అన్నదానం దైవ సేవతో సమానమని శ్రీ సత్య సాయి సేవ సమితి -2 సుబ్బదాసు భజన మందిరం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు పిఆర్టి సర్కిల్లో గల భజన మందిరంలో మహిళా దే సందర్భంగా 250 మందికి అన్నదాన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పుట్టపర్తి సత్యసాయి బాబా ఆశీస్సులతో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందులో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆకలిగున్న ప్రతి వ్యక్తికి అన్నదానం చేయటంలోనే ఎంతో సంతృప్తి ,సంతోషం కలదని తెలిపారు. సమాజ సేవ చేయుటలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే మానవతా విలువలు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు గౌరమ్మ, చౌడమ్మ, ప్రమీలమ్మ, లక్ష్మి, సాంబశివుడు, జనార్ధన, నాగిరెడ్డి, శేషు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ ఉండరాదు

విశాలాంధ్ర-ధర్మవరం: మహిళలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ ఉండరాదని, అలా ఉన్నచో అనేక రకమైన అనారోగ్యాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆరోగ్యమైన మహిళలు బలమైన కుటుంబం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్ తో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివమ్మ, హెల్త్ సూపర్వైజర్ రాజశేఖర్ రెడ్డి , ఐసిడిఎస్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పీలు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు గుత్తా సూర్యనారాయణ, రామ్మోహన్, జయప్రకాశ్ రెడ్డి, ఎర్రి స్వామి, కేశవరెడ్డి, దామోదర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 8వ రాష్ట్రీయ పోషణ మాసం

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంమలపన గుడి గ్రామంలో శుక్రవారం ఆర్డిటి భవనంలో రాష్ట్రీయ 8పోషణ కార్యక్రమాన్ని అంగన్వాడీ సూపర్వైజర్ ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు ఆరోగ్య అలవాట్లు, అధిక బరువు, బాల్య వివాహాల నివారణ గురించి వివరించారు. పిల్లలకు జంక్ ఫుడ్ పరిచయం చేయకూడదని చెప్పారు. చక్కెర నూనె ఉప్పు మరికొన్ని పదార్థాలను స్వల్ప మోతాదులో తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుద్రేశ్ అంగన్వాడి టీచర్ ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్, సాయి నగర్, తిరుమల లాడ్జ్ ఎదురుగా గల అరిగెల పోతన్న హాస్పిటల్లో ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గణేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉబ్బిన సిరలు సమస్యలతో బాధపడుతున్న వారికి, కోతలు, కుట్లు లేని చికిత్స, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, అధునాతన లేజర్ చికిత్సతో సదుపాయం కలగని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉచిత అపాయింట్మెంట్ కొరకు సెల్ నెంబర్ 9154991961 ను సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-ధర్మవరం: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు సిబ్బంది గట్టి చర్యలు తప్పక చేపట్టాలని పుట్టపర్తి జిల్లా విద్యుత్ ఎస్ఈ. సంపత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో పుట్టపర్తి డివిజన్లోని ఏఈలకు, డిఈలకు, ఇతర సిబ్బందికి రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్ఈ.సంపత్ కుమార్, విద్యుత్ సిఐ విశ్వనాథ్ చౌదరి విద్యుత్ ప్రమాదాల విషయంలో పాటించవలసిన విధి విధానాలను గూర్చి వివరించారు. అనంతరం విద్యుత్ సమస్యలపై అధికారులకు పుట్టపర్తి డివిజన్ అధికారులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ ఐ ఏ గంగాధర్, ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, సికేపల్లి డి ఈ లక్ష్మీనారాయణ, పుట్టపర్తి డివిజన్లోని డిఈలు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-రొళ్ల: గ్రామ వార్డు సచివాలయ జేఏసీ పిలుపు మేరకు రొళ్ల మండలంలో నూతన మండల జేఏసీని కమిటీని శుక్రవారం రొళ్ల సచివాలయం-2 ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల కేంద్రంలో జి.ఎస్.డబ్ల్యు.ఎస్ ఉద్యోగులు కలిసి మండల జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు కమిటీలో మండల ప్రెసిడెంట్గా పి.రవి, మండల ఉపాధ్యక్షులుగా సి.ఎస్ శశికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలాజీ నాయక్, కార్యదర్శిగా ఆంజనేయులు, జాయింట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, మహిళ సెక్రెటరీగా అరుణ, ట్రెజరర్గా మౌనికలను ఎన్నుకొన్నారు.

స్వచ్ఛత హీ సేవ 2025 వారోత్సవాలు

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో నేతాజీ మునిసిపల్ హై స్కూల్ నందు శుక్రవారం స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలు కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్ పర్సన్ డిఈ.రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఈ స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలు ఈనెల 19 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతాయని, ప్రతి ఇంట్లోనూ, బయట చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారంను ఉంచకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని ఉపయోగించకూడదని, ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ పేపర్లు లాంటివి వాడకం వలన ప్రజలందరూ అనారోగ్య పాలవుతున్నారని, ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని, మన హిందూపురాన్ని, స్వచ్ఛ హిందూపురంగా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం స్వచ్ఛ హీ సేవా ప్రతిజ్ఞ అందరి తోనూ చేయించి, పాఠశాల ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను పరిశుభ్రపరిచారు. అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, టీడీపీ నాయకులు మురళీ, మోదా శివ, చైతన్య, పాఠశాల హెచ్.ఎమ్. రమణ, మూర్తి, హెల్త్ అసిస్టెంట్ కేశవ, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడి సెంటర్ల, రోడ్డుకు ఇరువైపులా, మహిళా సంఘాల సభ్యులకు ఇంటికొక మొక్కలు నాటే కార్యక్రమంలో మండల గ్రామస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం బొమ్మనహాళ్ మండల పరిషత్ అధికారి విజయభాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీలో 600 మొక్కలు చొప్పున నాటుటకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు మండల వ్యాప్తంగా 10000 మొక్కలు నాటి గ్రీన్ బొమ్మనహాల్ మండలం గా ఏర్పాటుకు ప్రతి ఒక్కరు చెట్లు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమానికి గ్రామ, మండల స్థాయి, మహిళా సంఘ సభ్యులు, గ్రామ మండల ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొనాలని కోరారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ఉరవకొండ: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్వి తెలిపారు. శుక్రవారం వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామంలో స్వస్తి నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు గుండె జబ్బు, నోరు, రొమ్ము , గర్భాశయ, క్యాన్సర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య అధికారులు డాక్టర్ తేజస్వి, డాక్టర్ సర్దార్ వలి మాట్లాడుతూ... కిషోర్ బాలికలు గర్భిణీలకు , పిల్లలకు వివిధ పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎం పి హెచ్ ఈ ఓ గురు ప్రసాద్, సూపర్వైజర్ నాగ శంకర్ , సుశీలమ్మ, సీనియర్ ఏఎన్ఎం భ్రమరాంబ, ఏఎన్ఎం జయమ్మ, ఎంఎల్ హెచ్ పి లు అనురాధ, భారతి ,నిర్మల ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవులకు అదనపు బస్సులు

విశాలాంధ్ర-పుట్టపర్తి: దసరా సెలవులకు అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ తెలిపారు. శుక్రవారం రవాణా అధికారి కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ, పర్సనల్, అకౌంట్స్ ఇవ్వగల సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ మాట్లాడుతూ దసరా సెలవులు ఈనెల 24 నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు దసరా సెలవులు సందర్భంగా అదనపు బస్సులను ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపాలని డిపో అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి డిపోను ఆదాయాన్ని పెంచే దిశగా టిక్కెట్ల అమ్మకాలు, లాజిస్టిక్స్, స్టాల్స్, పర్యాటక సేవల ద్వారా నష్టాలను తగ్గించి పని చేయాలన్నారు. ఆదాయం రాని రూట్లలో ప్రయాణించి సేవల పునఃపరిశీలన చేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు మరియు గ్యారేజ్ సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలు నివారించాలన్నారు. దూర ప్రాంత సర్వీసుల్లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు శుభ్రంగా ఉండేలా చూసి, వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. డిపో మేనేజర్లు మరియు గ్యారేజ్ సూపర్వైజర్లకు కేఎంపిఎల్ను పెంచి, బ్రేక్ డౌన్లను తగ్గించి, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించాలన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా సెప్టెంబర్ నెలలో 11,49, 500 మంది ప్రయాణించి, రూ.5.68 కోట్లు లబ్ధి పొందినట్లు వెల్లడించారు. రోజుకు సగటున 54, 356 మంది మహిళలు ప్రయాణిస్తూ రూ.27.25 లక్షలు లబ్ధి పొందుతున్నారన్నారు. అనంతరం ధర్మవరం డిపో మేనేజర్ శ్రీ. సత్యనారాయణ ని రాష్ట్ర స్థాయిలో టైర్ల పర్ఫార్మన్స్ పెంచినందుకు ప్రశంసా పత్రంతో అభినందించారు. డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లు, డిపిటివో ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : కర్ణాటకలో పడిన అకాల వర్షాల కారణంగా చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోందనీ చిత్రావతి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి మండల తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుముల పల్లి, రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి , మండలంలోని పెడపల్లి పరిసర గ్రామస్తులకు పలు జాగ్రత్తలు తెలిపారు. చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాలలోనికి పిల్లలను, వృద్ధులను ఎవ్వరినీ పంపకండి. "పరగోడు" నుండి చిత్రావతి నదికి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున, పట్టణ, మండల పరిధిలో ఉండే లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

విశాలాంధ్ర-యాడికి: రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ పిలుపుమేరకు శుక్రవారం యాడికి మండల కేంద్రంలోని దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్ డౌన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు సంబందించి అమలులో గల ప్రైమ్ విధానములో గల సమస్యలు పరిష్కారం కోరుతూ 19,20తేదీలు రెండు రోజులు రాష్ట్ర దస్తా వేజు లేఖర్ల సంఘం పిలుపుమేరకు పెన్ డౌన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దస్త లేఖరులు జూటూరు అబ్దుల్ రజాక్, నరేష్, ఈశ్వరప్ప, నవీన్ కుమార్, రామ కేశవులు, దుర్గ, రుక్కు, గంగ, ప్రసాద్, రంగా నాగార్జున పాల్గొన్నారు.

ఐటి ఉద్యోగాలలో నైపుణ్యాలు ప్రమాణికం

విశాలాంధ్ర - జేఎన్టియుఏ: ఐటి ఉద్యోగాలలో నైపుణ్యాలు ప్రమాణికమనే క్యాప్ జెమినీ టెక్నాలజీస్ సాఫ్ట్వేర్ డెవలపర్ బి.సురేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మిట్స్ (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్) డీమ్డ్ టుబి యూనివర్సిటీ లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో స్టూడెంట్స్ చాప్టర్ వారి సహకారంతో "డేవ్ ఆప్స్ వెంగార్డ్: టూల్స్ అండ్ టాక్టస్ ట్రాన్స్ఫర్మేషన్ " అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిణామం అధిక ఉత్పాదకత, స్థిరత్వం కోసం అనేక ఆధునిక టూల్స్ని ఉపయోగిస్తుంది. డేవ్ ఆప్స్ యొక్క టాక్టిక్స్లో, అభివృద్ధి, ఆపరేషన్లు మరియు ఇతర విభాగాల మధ్య ఉత్తమ సమన్వయాన్ని పెంచడం, ఎజైల్ పద్ధతులను అనుసరించడం, ఆటోమేషన్ , ఇంటిగ్రేషన్ ఉపయోగించడం,ఎండ్-టు-ఎండ్ టెస్టింగ్ నిర్వహించడం ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీన్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ కే.సతీష్ , అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన మహిళ కుటుంబానికి పునాది

విశాలాంధ్ర-తాడిపత్రి: ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి పునాది అని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ అంగన్వాడి సూపర్వైజర్స్ శ్రీమతి ఉమాదేవి, శ్రీమతి రామలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రజక పేట అంగన్వాడి కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ అంగన్వాడి సూపర్వైజర్స్ శ్రీమతి ఉమాదేవి, శ్రీమతి రామలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ మాసం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళలలో స్థూలకాయం నివారణకు చర్యలు, మహిళల ఆహారపు అలవాట్లు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలన్నారు. బాల్య దశ నుండి సంరక్షణ, విద్య, శిశు చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు, పురుషుల భాగస్వామ్యం, పోషణ సంరక్షణ పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమేనన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డ్ కౌన్సిలర్ రంగనాథ రెడ్డి, 17 వ వార్డ్ కౌన్సిలర్ వరలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు,హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్లిన అధికారికి వీడ్కోలు

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని యర్రగుంట గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా గంగాధర విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందడంతో ఆయనకు స్థానిక కార్యాలయంలో సర్పంచ్ వన్నూరమ్మ,ఎంపిడిఓ చంద్రమౌళి ఆధ్వర్యం లో పంచాయతీ కార్యదర్శి గంగాధర్ కి వీడ్కోలు సభ నిర్వహించారు. 4 గ్రేడ్ నుండి 3 గ్రేడ్ కు పదోన్నతి పై దగ్గర కుసుంపల్లి పంచాయతీ కార్యదర్శి గా బదిలీ కావడంతో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వన్నూరమ్మ మాట్లడుతూ గంగాధర్ ,ఇక్కడ పనిచేసినంత కాలం ,సచివాలయం సిబ్బందితో,ప్రజలతో,రాజకీయ నాయకులతో, అందరికీ అనుకూలంగా అంటూ తమ విధులను సక్రమంగా నిర్వహించారని చెప్పారు. గ్రామ పెద్దలు టీడీపీ నాయకులు వన్నారెడ్డి కనేకల్ వైసిపి మండల కార్యదర్శి హనుమంతు, సచివాలయం సిబ్బంది,ప్రజలు పూలమాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకును ఖాతాదారులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-బెలుగుప్ప: ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఖాతాదారులకు సూచించారు మండల కేంద్రంలోని స్థానిక వ న్నూరు స్వామి కట్ట దగ్గర శుక్రవారం ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలో కన్నా తక్కువగా తపాలా ఆఫీసులో రూ.200 రూపాయలు నగదు చెల్లించి ఖాతాదారులుగా చేర్చుకుంటామన్నారు. ఒక సంవత్సరానికి 755 రూపాయలు ఖాతాదారులు చెల్లించుకుంటే రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే 15లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. సంవత్సరానికి 555 రూపాయలు చెల్లిస్తే అనారోగ్యంతో మృతి చెందితే పది లక్షలు ఇన్సూరెన్స్ బీమా వర్తిస్తుందన్నారు. అది కూడా 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపిపిబి అసిస్టెంట్ మేనేజర్ నవనీత్, టిడిపి నాయకుడు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పోస్ట్మాస్టర్ శివ, డాక్టర్ మధుసూదన్ రావు, మల్లికార్జున, సిబ్బంది ఉమ్మల నాయక్, వన్నూరు స్వామి ,శివ సదానంద, శివానంద ,తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించండి

విశాలాంధ్ర-అమరాపురం: సచివాలయాల ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని అమరాపురం మండలం సచివాలయం ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో రామారావుకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ యూనియన్ ఉద్యోగుల పిలుపుమేరకు అన్ని శాఖల ఉద్యోగులు కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అన్ని శాఖల ఉద్యోగుల వారి విద్యార్హత సర్వీస్ ఆధారంగా ప్రమోషన్ ఛానల్ కల్పించాలన్నారు. డోర్ టు డోర్ సర్వేలు క్లస్టర్ మ్యాపింగ్ చేసి వాలంటీర్ విధులు నిర్వహించడం అనేది మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధానాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు రెవిన్యూ శాఖ ఉద్యోగులు సచివాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పెనుకొండ: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం 2వ రోజు కూడా తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సిపిఐ నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వానికి అనేక సేవల అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు నేటికీ కూడా జీతాలు పెంచడం లేదు అనేక ప్రభుత్వాలు మారుతున్న కూడా గ్రామ రెవెన్యూ సహాయకుల తలరాతలు మారలేదని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. వీఆర్ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని, వీఆర్ఏలకు కనీస వేతనం 22 వేల రూపాయలు ఇవ్వాలని, నామినేలను వీఆర్ఏ లోగా నియమించాలని, అటెండర్ రికార్డ్ అసిస్టెంట్ వాచ్మెన్ పోస్టులు ఇవ్వాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న నిరసన కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని తాసిల్దారు స్వాతి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున , నరసింహులు, వీఆర్ఏల సంఘం నాయకులు నరసప్ప ,అంజనప్ప, లక్ష్మీకాంతమ్మ, సుశీలమ్మ, రాజేశ్వరి, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుడిబండ: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల వీఆర్ఏలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వీఆర్ఏలకు అటెండర్, వాచ్మెన్, అలాగే ప్రమోషన్లు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలి, పే స్కేలు అమలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టి పి లింగప్ప, నరసింహమూర్తి ,పెన్నాఓబులప్ప,అనిత, భాగ్యమ్మ,మంజునాథ, దాస్,తిప్పే స్వామి,సన్నపతి, చిరంజీవి,రవి, నరసయ్య, మంతేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండలంలో అర్బన్ పోలీస్ స్టేషన్ నందు ఈ రోజు జీఎంఎస్కేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అర్బన్ సీఐ శివరాముడు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఐ శివరాముడు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో జరిగే శారీరక దాడులు, మహిళలు-పిల్లలకు సంబంధించిన నేరాలు, అలాగే ప్రస్తుత సమస్యలపై ముందస్తు సమాచారం సేకరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి జీఎంఎస్కే సభ్యుడు గ్రామ స్థాయిలో జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే పై అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. నేరాలు, వివాదాలు అరికట్టడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించవచ్చని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, వారిని అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. "సమాజ భద్రతలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలి. ప్రతి గ్రామం సురక్షితంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసన్న, అన్ని గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయింపు

విశాలాంధ్ర-కొత్తచెరువు: పోరాటాలతోనే మామిళ్లకుంట క్రాస్ లో దళితులకు స్మశాన వాటికకు రెవిన్యూ అధికారులు స్థలం కేటాయించి సరిహద్దులు శుక్రవారం ఏర్పాటు చేశారని. సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ,తెలిపారు. ఈ స్థలం కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు ఈ కాలనీవాసులకు స్మశాన వాటిక లేక ఇబ్బందులు పడేవారు. ఈ స్థలం కేటాయించడం పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ వెంకటేష్, జిల్లావ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశు, పైపల్లె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్స్ నిరసన

విశాలాంధ్ర-గుత్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0, ఆధార్ ఓటిపి విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లా గుత్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజులేఖరుల నిరసన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజులు లేఖరుల సంఘం పిలుపుమేరకు గుత్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం నుండి రెండు రోజులపాటు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ చేసినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఎలాంటి సేవలు అందించబోమని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్స్ బండి సత్య ,రఘు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 విధానం వల్ల ప్రజలకు దస్తావేజు లేఖర్లకు విపరీతమైన సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ బండి సత్య , అనంత ,రఘు ,నరేష్ రాయల్ ,సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, అధికారులు చొరవ చూపాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: కార్పొరేట్ మంగళ షాపులను తొలగించాలని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ ఆఫీస్ నందు కమిషనర్కి ప్రజలు,ప్రజా సంఘాల నాయకుల ద్వారా సంతకాల సేకరణ దాదాపు 3,000 మంది ప్రజల సంతకాలు చేసిన ప్రతులను, క్షవర వృత్తిదారుల డిమాండ్సను మునిసిపల్ కమిషనర్కి ఇచ్చారు. ఈ కార్య క్రమానికి క్షవర వృత్తి దారుల సంఘం కోశాధికారి ఎం.బ్రహ్మ కుమార్ అధ్యక్షతన జరిగింది. అనంతరం జిల్లా కన్వీనర్ బి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ వృత్తిదారుల సమస్యల 15 రోజులుగా ఈ ఉద్యమం చేస్తున్న కానీ అధికారులు ప్రజా ప్రతినిధులు గాని స్పందించలేదని నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు చొరవ తీసుకొని క్షవర వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న మంగలి వృత్తిదారులకు అండగా నిలబడలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ. ప్రధాన కార్యదర్శి సూరి సంఘం నాయకులుఅజయ్ .సురేంద్ర .శివ .ఎర్రిస్వామి.చంద్ర .చరణ్ .బాల కుమార్,స్వామి. బాలకృష్ణ. అనిల్ .అంజి. సాగర్ .మురళి. ప్రసాద్. పవర్ .శేఖర్ .గణేష్ .రంగా. వీరాంజనేయులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై వీఆర్ఏలు ధర్నా

విశాలాంధ్ర-గుత్తి: తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం గ్రామ రెవెన్యూ సహాయకులు రెండో రోజు మోకాల మీద నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్ఎ సంఘ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో వాచ్మెన్ అటెండర్, డ్రైవర్లకు పదోన్నతులు కల్పించాలని,నామిని విఆర్ఏలను క్రమబద్ధీకరించాలని, వయస్సు తో సంబంధం లేకుండా చనిపోయిన కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని, రీ సర్వేలో పాల్గొంటున్న వారికి టిఎ,డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వీఆర్ఏల అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు పెద్దన్న,సలహా అధ్యక్షులు నారాయణ స్వామి, క్రమశిక్షణ అధ్యక్షులు సుధాకర్ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల రక్షణ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కోలే గుండ్ల శేఖర్

విశాలాంధ్ర-ఉరవకొండ: రాజ్యాంగ హక్కుల రక్షణ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉరవకొండ పట్టణానికి చెందిన కోలే గుండ్ల శేఖర్ నియమితులయ్యారు. రాజ్యాంగ హక్కుల రక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లాయర్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగినట్లు నూతన జాతీయ ప్రధాన కార్యదర్శి కోలే గుండ్ల శేఖర్ తెలిపారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలు యొక్క హక్కుల సాధనకై రాజ్యాంగ హక్కుల రక్షణ సంస్థ పనిచేస్తుందని తెలిపారు.

గోవినవాడ వారపు సంత వేలం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : గోవిందవాడ గ్రామపంచాయతీలో వారాంతపు సంత మార్కెట్ వేలమును శుక్రవారం నిర్వహించారు. అత్యధిక వేలంపాటదారుడిగా గొల్లే హెూటల్ వన్నూరు స్వామిఅనే అతను 92వేల రూపాయలకు వేలమును దక్కించు కున్నాడు. ఈ వేలంలో ఈవో పి ఆర్ డి దేవదాసు సర్పంచ్ నాగవేని,పంచాయతీ కార్యదర్శి బాబా ప్రకృద్దీన్,ఇతర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: వీఆర్ఏలు తమ సమస్యల సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు చేపడుతున్న నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా ముదిగుబ్బ మండలంలో కూడా వీఆర్ఏలు శుక్రవారం రెండవ రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు వీఆర్ఏల నిరాహార దీక్ష రెండో రోజు కార్యక్రమానికి సంఘీభావం తెలిపి తద్వారా వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో ఈనెల 22వ తేదీ వీఆర్ఏలు రాష్ట్రవ్యాప్తంగా ఎవరి జిల్లాల్లో వారు పెద్ద ఎత్తున కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు, కాగా ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి కూడా సిపిఐ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపి ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కూడా కృషి చేస్తామని ఈ సందర్భంగా శ్రీనివాసులు పేర్కొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసే సహించేది లేదు

విశాలాంధ్ర-బుక్కపట్నం: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని సత్య సాయి జిల్లా కురవ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర కురవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర కురవ సంఘం అధ్యక్షుడిగా చెప్పుకునే జబ్బుల శ్రీనివాస్ రాష్ట్ర మంత్రిపై లేని పోనీ ఆరోపణలు చేస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రాష్ట్ర కురవ సంఘం అధ్యక్షులు అని మాట్లాడే నీవు ఇంతవరకు కురవ సంఘానికి ఏమైనా మేలు చేశావ అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సంఘం నాయకులు సురేంద్ర, మంజునాథ్, నాగరాజు, శేఖర,ఆంజనేయులు పాల్గొన్నారు.